ప్రజాశక్తి
గురువారం 19 అక్టోబర్ 2023 5
పార్వతీపురం మన్యం

ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని చిన్నమంగళాపురం హైస్కూల్ ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. బుధవారం పాఠశాలను సందర్శించిన ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యపుస్తకాల్లో సంబంధించి ప్రశ్నలు అడుగగా సరి అయిన సమాధానాలు రాక అసంతృప్తి చెందారు. పదో తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయులు అందరికీ షోకాజ్ నోటీస్ జారీ చెయ్యాలని హెచ్ఎం జామి రవిని ఆదేశించారు. అదే విధంగా నాడు, నేడు పనులు పరిశీలించి సక్రమంగా చేపట్టలేదని అసంతృప్తి చెందారు. ఈయన వెంట మండల విద్యాశాఖాధికారి పి.కృష్ణమూర్తి ఉన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుతో సగటు వినియోగదారులు విలవిల లాడుతున్నారు. గృహ వినియోగదారులు, చిన్నవ్యాపారులు, రైతులు, ఫెర్రో పరిశ్రమల యాజమాన్యాలు ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నాయి. సర్దుబాటు. ట్రూ అప్ ఛార్జీల పేరిట మోపిన భారం వల్ల జిల్లాపై ఏడాదికి సుమారు రూ.24కోట్ల మేర భారం పడుతోంది. బిజెపి ఆధ్వర్యాన వైసిపి ప్రభుత్వం మోపుతున్న విద్యుత్ భారాలపై ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తమౌతోంది. ఈనేపథ్యంలో విజయనగరం ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన చేపడుతున్న ఆందోళనా కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వామ్యమౌతున్నారు. సిపిఎం పోరాటంలో భాగంగా విజయనగరంలోని ఎన్‌పిఆర్ (సిపిఎం) కార్యాలయంలో ఈనెల 19న రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నారు. సదస్సుకు ముఖ్య వక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, రాష్ట్ర నాయకులు సిహెచ్ నర్సింగరావు హాజరు కానున్నారు.



6 యూనిట్లకు రూ.196 బిల్లు వచ్చింది

నేను అద్దెకు తీసుకున్న ఇల్లు మూడు నెలలుగా మూతపడి ఉంది. కరెంటు పూర్తిగా వాడలేదు. కానీ, 6యూనిట్లు వినియోగించినట్టుగా బిల్లలు వచ్చింది. బిల్లు మాత్రం రూ.196 వచ్చింది. ఇది చాలా దారుణం. ఆరు నెలల క్రితం కనీస ఛార్జీ రూ.60 మాత్రమే వచ్చేది. ఎందుకింతలా భారం పడుతోందంటే విద్యుత్ శాఖ సిబ్బంది ఎవరూ స్పష్టంగా చెప్పడం లేదు. ఎప్పుడో వినియోగించిన విద్యుత్‌పై ఇప్పుడు ఛార్జీలు విధిస్తున్నట్లు సిపిఎం నాయకుల ప్రచారం ద్వారా అర్థమౌతోంది. ప్రభుత్వానికి డబ్బులు గుంజుకోవడం తప్ప, ప్రజలపై పడుతున్న భారాలు గుర్తుకు రావడం లేదు.

– గవర వెంకటరమణ, కస్రోతు వీధి, సీతానగరం

సర్దుబాటు పేరిట బాదుడు

- ఏడాదికి రూ.24 కోట్ల భారం
- విద్యుత్తు భారాలకు వ్యతిరేకంగా నేడు సిపిఎం ఆధ్వర్యాన సదస్సు
- హాజరు కానున్న రాష్ట్ర నాయకులు నర్సింగరావు, తులసీదాస్

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లాలో 8,11,017 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహాలకు 6,71,921, వాణిజ్యం 68,939, ప్రభుత్వ కార్యాలయాలకు 15,321, వ్యవసాయ పంపుసెట్‌లకు, 52,082 ఉన్నాయి. వీటన్నింటికీ ఎపిఇపిడిసిఎల్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. వినియోగదారులంతా ఎప్పటికప్పుడే బిల్లులు చెల్లిస్తున్నారు. ఒక వేళ గడువు తేదీలోపు చెల్లించకపోతే ఫీజులు పీకేసి మరీ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. అయినప్పటికీ వినియోగదారులు చెల్లించిన డబ్బులు విద్యుత్తు ఉత్పత్తికి, పంపిణీ తదితర ఖర్చులకు సరిపోలేదంటూ వసూలు చేస్తున్నారు. సర్దుబాటు ఛార్జీ అంటే ఇదే. మరే సంస్థలోనూ లేని విధంగా విద్యుత్ పంపిణీ సంస్థల్లోనే ఇటువంటి విధానం ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే 2014 నుంచి 19 వరకు వినియోగించుకున్న విద్యుత్‌కు చెల్లించిన బిల్లులు సరిపోలేదంటూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,900 కోట్లమేర సర్దుబాటు భారం మోపింది. జనం నుంచి మూడేళ్లపాటు వసూలు చేయడానికి విద్యుత్ ఛార్జీల నియంత్రణ మండలి ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు ఆమోదం పొందాయి. ఇప్పటికే యూనిట్‌కు 20పైసలు చొప్పున 11నెలల పాటు వినియోగదారులు అదనంగా చెల్లించారు. మరో 25 నెలలపాటు చెల్లించాల్సి వుంది. ఇది చాలదన్నట్టుగా 2021 –22 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన విద్యుత్ బిల్లులకు చెల్లించిన మొత్తం సరిపోలేదంటూ మరోసారి 20పైసలు చొప్పున సర్దుబాటు ఛార్జీలు మోపుతున్నారు. పాత, కొత్త సర్దుబాటు ఛార్జీలు 40పైసలు మోయడమే వినియోగదారులకు అత్యంత కష్టతరంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ భారాన్ని తగ్గించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పడుతున్న భారాలకు ఎప్పటి వరకో ఎందుకు ఆగాలి అంటూ మరుచటి నెలలోనే సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయాలని ఆదేశించింది. మోడీ ఆదేశాలే తడువుగా జగన్ సర్కారు ఏప్రిల్ నెలలో చెల్లించిన డబ్బులు సరిపోలేదని మరో 40పైసలు వసూళ్లకు సిద్ధపడింది. ఈ లెక్కన కేవలం సర్దుబాటు ఛార్జీ రూపంలోనే 80పైసలు భారం పడుతోంది. జిల్లాలో రోజుకు సుమారు కోటి యూనిట్ల వినియోగం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వాసులపై నెలకు రూ.80లక్షల వరకు భారం పడుతోంది. ఏడాదికి రూ.24కోట్ల భారం పైమాటే. దీనికితోడు నెలవారీ వినియోగపు బిల్లు, ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ట్రూ అప్ ఛార్జీ తదితరాల రూపంలో అధిక మొత్తంలో బిల్లులు విధించారు. 20 నుంచి 30 యూనిట్లు వినియోగించిన సామాన్య కుటుంబాలకు వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. దీంతో, గత నెలతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో బిల్లులు వచ్చాయంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఛార్జీకన్నా ఇలా కొసరుగా విధిస్తున్న ఛార్జీలే అధికంగా ఉన్నాయి. వాస్తవానికి సర్దుబాటు ఛార్జీలకు పాలకుల విధానాలే కారణం. బొగ్గు, ఇంధన రేట్లు కార్పోరేట్ సంస్థలు తమ ఇష్టానుసారంగా పెంచుకునేందుకు సహకరిస్తున్నాయి. ఫలితంగా విద్యుత్ తయారీ, పంపిణీ సంస్థలపై పెరిగిన భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమవుతున్నాయి.

ఛార్జీల పెంపుతో భారంగా మారింది

విద్యుత్‌ఛార్జీల యూనిట్ ధర డబుల్ రావడంతో భారంగా మారింది. మెకానిక్ రంగంలో బతకడం కష్టంగా ఉంది. ప్రతినెలా ఛార్జీలు పెరిగిపోతే కుటుంబాన్ని ఎలా పోషించుకోగలుగుతాం. అప్పుడెప్పుడో వాడిన విద్యుత్తుకు ఇప్పుడు ఛార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారు. యూనిట్లలో తేడా లేకపోయినప్పటికీ అదనపు ఛార్జీలు వసూలు చేయడం అన్యాయం.

– జె.మహేష్, మెకానిక్, విటి అగ్రహారం, విజయనగరం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

సీతంపేట నుంచి బస్సుయాత్ర

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-సీతంపేట

ఈ నెల 30న రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా రక్షణ బస్సుయాత్ర సీతంపేటలో ప్రారంభమవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎ.భాస్కరరావు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బస్సు యాత్రకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వం వహిస్తారన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు అభివృద్ధిని పక్కన పెట్టి, బిజెపి విధానాలకు వత్తాసు పలుకుతున్నాయని ధ్వజమెత్తారు. వీటిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, మండల కార్యదర్శి డి.రమణారావు, జగన్, భాస్కరరావు పాల్గొన్నారు.

ఎండిన వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఎండిన వరిపంట పరిశీలన

ప్రజాశక్తి – పార్వతీపురం రూరల్

మండలంలోని బాలగుడబ, నర్సిపురంలో వర్షాభావ నీటి ఎద్దడికి గురై ఎండిపోతున్న వరి పంటను ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆర్.శ్రీనివాస్, రైతు శిక్షణ కేంద్రం ఎడి శారద, ఎఒ అశోక్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వరి పంట నష్టం ప్రాథమిక అంచనా వేస్తున్నామన్నారు. ఎఒ మాట్లాడుతూ వర్షం పడక, తేమ లేని వరి పంటలకు ఎకరాకు 2 కేజీలు 19:19:19 లేదా 13:0:45 లేదా మల్టీకే వంటి రసాయనాలు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. లీటర్ నీటికి 5 మిల్లీలీటర్లు కలుపుకొని 14 నుండి 16 ట్యాంకులు పిచికారీ చేయాలన్నారు. అలా చేయడం వల్ల వారం నుంచి పది రోజుల వరకు తేమ ఉండి మొక్కలు వాడిపోకుండా నివారించ వచ్చునని తెలిపారు. పూర్తిగా వాడిన వరి పంట నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి

- వికలాంగుడని చూడకుండా పిడిగుద్దులు
- పోలీసుస్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్,టౌన్

వివరాలు వెల్లడిస్తున్న బాధిత ఉద్యోగి శంకరావు

జిల్లా కేంద్రంలోని కొత్త బెలగాం 16వ వార్డు 8వ సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శి జి.శంకర్రావుపై అదేవార్డుకు చెందిన కొందరు బుధవారం దాడి చేశారు. పిడిగుద్దులు గుద్దుతూ భౌతికదాడికి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. 8వ సచివాలయానికి 16వ వార్డుకు చెందిన తొంగ్రంగి సంతోష్‌కుమార్, జంపా జగన్నాధం, పాలకొల్లురాముతో పాటు మరికొందరు వ్యక్తులు మధ్యాహ్న భోజన సమయంలో వెళ్లారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గొండేల వెంకటరమణ (వికలాంగుడు)తో జగనన్న చేదోడు పథకంలో తాము అర్హులమైనప్పటికీ ఎందుకు ఎందుకు పరిగణలోకి తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా అతనిపై చేయి చేసుకుంటూ కులంపేరుతో దూషించారని బాధితుడు చెప్పాడు. భయంతో కేకలు వేయడంతో తన సహోద్యోగి రావడంతో బతికానని తెలిపాడు. ఈ సంఘటన మధ్యాహ్నం 2గంటలకు జరిగినప్పటికీ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు రాత్రి 7గంటల వరకు తీసుకోలేదు. దీంతో మిగతా సచివాలయ ఉద్యోగులంతా తమ విధులు ముగించుకుని పోలీసు స్టేషన్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేసారు. ఇంతలో ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర కార్యదర్శి జివికిషోర్ కల్పించుకుని పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసి, బాధితుడు, ఉద్యోగులు కలసి డిఎస్‌పి కార్యాలానికి వెళ్లారు. సచివాలయ పరిధిలోని ఒక వార్డుకు చెందిన రాజకీయ నాయకుని ప్రమేయం ఉండడం వల్లే కేసు నమోదు చేయడానికి పోలీసులు వెనుకాడుతున్నట్లు సచివాలయ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈసంఘటనపై వెంటనే కేసు నమోదు చేసి బాధితునకు న్యాయం చేయాలని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అభ్యంతరాలు చెప్పండి

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

ఈ నెల 27న ఓటరు జాబితా ముసాయిదా ప్రచురిస్తారని, వాటిలో అభ్యంతరాలుంటే తెలియజేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఓటర్ల పునశ్చరణ అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఇవిఎం గోదాంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం 7, 8 ద్వారా ఓటర్ల జాబితాను సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. ముసాయిదాలోని క్లైములు, అభ్యంతరాలను ఈ నెల 27 నుంచి డిసెంబరు 9 వరకు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరిస్తామని, 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణకు సిద్ధం అవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో డిఆర్ఒ జె.వెంకటరావు, బిజెపి ప్రతినిధి ఆర్.ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి జి.గిరిధరరావు, టిడిపి ప్రతినిధి వి.రాఘవేంద్రరావు, వైసిపి ప్రతినిధి సిహెచ్.సంతోష్ కుమార్, జనసేన పార్టీ ప్రతినిధి పైల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

20న కురుపాంలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి – కురుపాం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఈ నెల 20న కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వి.వి.శివరామప్ప ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారని, మండలంలో అధికారులంతా హాజరవుతారని చెప్పారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేయొచ్చని తెలిపారు.

నేడు ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం జిల్లాకు వస్తున్నారు. స్థానిక లయన్స్ క్లబ్‌లో 'అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్' పేరుతో ప్రెస్ అకాడమీ, ఐఆర్‌పిడబ్ల్యుఎ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొననున్నారు. సదస్సు అనంతరం బయలుదేరి అరకు వెళ్తారు.

జంక్షన్ జామ్!

స్వయం ఉపాధి పేరుతో ఇష్టారాజ్యంగా కొందరు ఆక్రమణలకు పాల్పడడంతో ప్రజల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారాయి. అదే సమయంలో ఆక్రమణల కింద భారీ పైపులైన్లు ఉండడంతో, అత్యవసర సమాయాల్లో లీకులు ఏర్పడితే వాటికి మరమ్మతులు ఎలా చేయాలోనని అధికారులు తలలు పట్టుకున్నారు. ఆక్రమణలన్నీ రాజకీయ అండదండలతోనే సాగడంతో అధికారులది నోరెత్తలేని పరిస్థితి. ఇదీ మండలంలో ఎర్రన్న గుడి జంక్షన్ దుస్థితి.

ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసిన అక్రమ కట్టడాలు

- ఎర్రన్నగుడి జంక్షన్‌లో ఆక్రమణల పర్వం
- రోడ్డుకిరువైపులా ప్రభుత్వ స్థలాల్లో భారీ నిర్మాణాలు
- తాగునీటి పైపులపైనా కట్టడాలు
- ఆక్రమణలతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇక్కట్లు
- సాధారణంగా మారిన ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి –గరుగుబిల్లి

తోటపల్లి పాత బ్యారేజీపై నుంచి వాహనాల రాకపోకలు నిలిపేసిన నుంచి మండలంలోని ఎర్రన్న గుడి జంక్షన్ కీలకంగా మారింది. గరుగుబిల్లి మండల కేంద్రంతో పాటు ఉల్లిభద్రకు ఈ జంక్షన్ మీదుగే వెళ్లాల్సి ఉంటుంది. అటు పాలకొండ, శ్రీకాకుళం, ఇటు కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాలకు కూడా ఈ జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించాలి. దీంతో నిత్యం ఈ జంక్షన్ వాహనాల రాకపోకలతో రద్దీగా మారింది. అదే సమయంలో పాలకొండ, శ్రీకాకుళం, కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురానికి వెళ్లే ఆర్‌టిసి బస్సులు ఎక్కాలనుకునే గరుగుబిల్లి మండల వాసులకూ ఈ జంక్షనే కీలకం. దీంతో కొందరు వ్యాపారులు మొదట్లో తోపుడు బండ్లతో తినుబండారాలు, పండ్లు వంటివి విక్రయించేవారు. ఎర్రన్న గుడి జంక్షన్ రోడ్డుకిరువైపులా ప్రభుత్వ స్థలాలు కావడంతో కొందరు షాపుల కోసం శాశ్వత ప్రాతిపదిక నిర్మాణాలు చేపట్టారు. ఇలా షాపులు పెట్టిన వారు విద్యుత్ కనెక్షన్లు, తాగునీటి బోర్లు సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఇలా అక్రమ నిర్మాణాలతో విశాలమైన ఎర్రన్న గుడి జంక్షన్ నేడు పూర్తి కుచించుకుపోయింది. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి, ఎప్పుడు ఏ ప్రమాదంతో జరుగుతుందోనని స్థానికులు, వాహనదారులు హడలిపోతున్నారు.

నిర్మాణాలతో ట్రాఫిక్‌కు ఇక్కట్లు

రోడ్డుకిరువైపులా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద నిత్యం ట్రాఫిక్ తలెత్తుతోంది. ప్రధాన రహదారి ఎర్రన్న గుడి జంక్షన్ మీదుగా వెళ్తుండటంతో ఆర్‌టిసి బస్సులు సహా ఇతర వాహనాలతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో ప్రమాదాలు సైతం సాధారణంగా మారిపోయాయి. ప్రమాదాల కారణంగా ఎందరో వాహనదారులు, పాదచారులు సైతం కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆక్రమణల కారణంగానే ఈ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వారు వాపోతున్నారు. ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతోపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల సపోర్టు..?

ఆక్రమణలకు అధికారుల సపోర్టు ఉందా..? అంటే అవుననే సమాధానాలే వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ స్థలం అందులోనూ భారీ పైపులైన్లపై నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు నోరెత్తడం లేదు. సరికదా.. ఆయా షాపులకు విద్యుత్తు, బోరు కనెక్షన్లకు కూడా అనుమతులు ఇచ్చేస్తున్నారు. ప్రజల నుంచి తీవ్రమైన విమర్శలు వచ్చిన సమయంలో తూతూమంత్రంగా హెచ్చరించడం, తరవాత ఆ ఊసే ఎత్తకపోవడం అధికారులకు పరిపాటిగా మారింది. 2018లో అప్పటి తహశీల్దార్ ఆక్రమణదారులకు నోటీసులిచ్చారు. తరవాత ఏమైందో ఏమోగాని ఆయన గాని, ఆ తరవాత వచ్చిన తహశీల్దార్లు గాని ఆక్రమణలపై నోరెత్తడం మానేశారు. ఆక్రమణదారుల నుంచి నెలవారీ మామ్మూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ఆక్రమణలపై చూసీచూడనట్లు వెళ్లిపోతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

భారీ పైపులైన్లపై నిర్మాణాలు

ఎర్రన్నగుడి జంక్షన్ మీదుగా తోటపల్లి బ్యారేజీ నుంచి పార్వతీపురం మున్సిపాల్టీకి తాగునీరందించడానికి భారీ పైపు లైన్లు వేశారు. ఆ పైపులైన్ల మీదే కొందరు ఆక్రమణదారులు శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. దీనివల్ల భవిష్యత్తులో ఎటువంటి మరమ్మతులు చేయాలన్నా ఇబ్బందులు తప్పవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తాగునీటి సరఫరా ఇబ్బందులు ఏర్పడినా, ఎక్కడైనా భారీ పైపు లైన్ లీకైనా మరమ్మతులు చేయాలంటే ఆ నిర్మాణాలు పడగొట్టాల్సి ఉంటుంది. అందుకు వ్యాపారులు ఒప్పుకుంటురా? అన్నదే పెద్ద ప్రశ్నగా మారింది. రోడ్డుకు మరో వైపు ఉన్న ఆర్అండ్‌బి స్థలాల్లోనూ అక్రమ నిర్మాణాలు చేపట్టారు.

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టొద్దు

రోడ్డు వెడల్పు చేసే సమయంలో ఆర్అండ్‌బి స్థలాల్లో ఆక్రమణలు తొలగిస్తాం. ప్రభుత్వ స్థలాల్లో శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టకూడదు. భవిష్యత్తులో ఎర్రన్న గుడి జంక్షన్ మీదుగా నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టే అవకాశముంది. రోడ్డు విస్తీర్ణం జరిగే క్రమంలో ఎవరు చెప్పినా కూల్చడం ఖాయం.

– నిర్మల, ఆర్అండ్‌బి అధికారి

ఆక్రమణలు తొలగించడం ఖాయం

పైపులైన్లకు సమస్య వస్తే వాటిపై నిర్మించిన ఆక్రమణలను తొలగిస్తాం. ఎవరైనా సొంత స్థలాలుంటే, పైపులైన్లకు దూరంగా నిర్మాణాలు చేపట్టుకోవాలి. అలా కాకుండా పైపులైన్లపై నిర్మాణం చేస్తే మరమ్మతుల సమయంలో తొలగించడం ఖాయం.

– జి. ఆనందరావు, ఎఇ, పార్వతీపురం మున్సిపాలిటీ

ఒఎఫ్‌సి కేబుల్ నిర్మాణానికి
అటవీ అనుమతులు మంజూరు

ప్రజాశక్తి-పార్వతీపురం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

జిల్లాలో మొబైల్ టవర్ల ఒఎఫ్‌సి కేబుళ్ల వేసేందుకు అటవీ అనుమతులు మంజూరు చేస్తూ జిల్లా స్థాయి కమిటీ నిర్ణయం తీసుకుంది. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. పాచిపెంట మండలం తోటవలస నుండి మోతుమూరు వరకు ఒఎఫ్‌సి కేబుళ్లను వేయుటకు 1.65 ఎకరాలను కేటాయించారు. పాలకొండ, భామిని, సీతంపేట, వీరఘట్టం మండలాల్లో ఉన్న 55 మందికి ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలకు గాను 61.34 ఎకరాల స్థలానికి అటవీ అనుమతులిచ్చారు. రెవిన్యూ, అటవీ, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, మంజూరు చేసేందుకు సిఫార్సులు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన సూచనలకు అనుగుణంగా, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి, సామాజిక మార్పుకు, వైద్య అత్యవసర పరిస్థితులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అధిక ప్రాముఖ్యత దృష్ట్యా వీటిని మంజూరు చేసినట్లు కమిటీ తీర్మానించింది. ఈ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, జిల్లా అటవీ అధికారి జిపిపి ప్రసూన, పార్వతీపురం ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్, గుమ్మలక్ష్మీపురం జెడ్‌పిటిసి ఎం.రాధిక, జియో ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్ద
యువకుల కొట్లాట

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని తీరప్రాంతమైన పెద్ద కొండ్రాజుపాలెం గ్రామానికి పండుగకు వచ్చి మద్యం షాపువద్ద మంగళవారం రాత్రి జరిగిన కొట్లాటలో ఇద్దరు యువకులు కొన ఊపిరితో ఉండగా మరో యువకుడికి గాయాలయ్యాయి. దీనిపై స్థానికులు అందించిన వివరాలు మేరకు.. పెద్ద కొండ్రాజుపాలెం పంచాయితీ గ్రామ దేవత పండుగలు జరుగుతున్నాయి. పెద్దకొండ్రాజుపాలెం గ్రామానికి చెందిన కేశం అమ్మోరు విశాఖపట్నంలో ఉంటు పండుగకు వచ్చాడు. మద్యం కొనుగోలు చేసేందుకు సమీపంలోని తోటపల్లి మద్యం షాపుకు వెళ్లాడు. ఇంతలో విశాఖపట్నానికి చెందిన మూతుడు, ముక్కాం గ్రామానికి చెందిన నవీన్ అలియాస్ గ్స్రాపడు, మైలపల్లి రాజు మరి కొంత మంది వచ్చారు. మద్యం కొనుగోలుకు వెళ్లినప్పుడు భుజం రాసుకొని వెళ్లడంతో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఇందులో మూతుడు జేబులో ఉన్న కత్తి తీసి అమ్మోరు కడుపు లోన శరీరం పైన ఇస్తాను సారంగా పోడిచాడు. అమ్మో రుతో వచ్చిన మారుపల్లి చినరాముడు అడ్డుపడగా మూతుడు ఆ వ్యక్తి తలపై బీరు సీసాతో బలంగా కొట్టాడు. దీంతో చినరాముడు అక్కడకక్కడే కుప్ప కూలిపోయాడు. వెంటనే వారు పారిపోవడంతో అక్కడే ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం వారిని విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కె.జి.హెచ్‌కు తరలించారు. ఇందులో అమ్మోరు, చినరాముడు చావు బతుకుల మధ్య ఉన్నట్లు చెబుతున్నారు. దీనిపై భోగాపురం సిఐ బి.వి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్.ఐ కృష్ణమూర్తి నిందుతులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

రహదారి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కొమరాడ

ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా కొత్తవలస రహదారిని ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కొత్తవలస ఓవర్ బ్రిడ్జి నిర్మించే సమయంలో జంఝావతి కాలువ నుండి ఆంజనేయ గుడి వద్దకు రహదారి కల్పిస్తామన్న హామీని అధికారులు వెంటనే అమలు చేయాలని బుధవారం చంద్రంపేట నుంచి కొత్తవలస వెళ్లే రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రంపేట పరశు రాంపురం, గుణానపురం, మార్కొండపుట్టి గ్రామస్తులు కొత్తవలస మీదుగా ఓవర్ బ్రిడ్జికి వెళ్లకుండా జంఝావతి కాలువపై ఆంజనేయ ఆలయం వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీనిచ్చారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పార్వతీపురం వెళ్లాలంటే కొత్తవలసలో నుండి వెళ్లడంతో, ఇరుకైన రహదారి ఉండడంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు.

గ్రీన్‌అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-పాచిపెంట

గ్రీన్ అంబాసిడర్ల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పనుకువలస గ్రామంలో గ్రీన్‌అంబాసిడర్లతో కలిసి ఆయన మాట్లాడారు. ఏడాది కాలంగా వేతనాలు చెల్లించకుంటే గ్రీన్ అంబాసిడర్ల కుటుంబాలు ఎలా బతుకుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వం బాధ్యతల నుంచి తప్పుకొని గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేస్తుందన్నారు. దీని కారణంగా పంచాయతీలు నిధులు లేక, అభివృద్ధి చేయడం లేదని సర్పంచులు వాపోతున్నారని తెలిపారు. ఇటీవల కలెక్టర్‌ను కలిసి గ్రీన్ అంబాసిడర్ల సమస్యను విన్నవిస్తే, వేతనాల చెల్లింపునకు హామీనిచ్చారని గుర్తుచేశారు. పండగ పూట పస్తులుంచకుండా వేతనాలు త్వరగా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు ఆర్.నందికేశవ, సిహెచ్.బంగారమ్మ, ఎస్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

వైసిపి పాలనకు చరమగీతం

ప్రజాశక్తి- గజపతినగరం

జన సేన, టిడిపి కలయికతో జిల్లాలోను, రాష్ట్రంలోను వైసిపి పాలనకు ప్రజలు చరమగీతం పాడుతారని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. జనసేన పిఎసి సభ్యు రాలుగా నియమితులైన పడాల అరుణను బుధవారం గురాన అయ్యలు ఆధ్వర్యంలో గజపతినగరంలో కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మీడియాతో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పని చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన-టిడిపి కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వం కొనసాగిస్తున్న ధమనకాండ నుంచి ప్రజలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆదాడ మోహన్ రావు, డి.రామచంద్రరాజు, మాతా గాయిత్రి, పితాల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న సూర్యప్రకాశరావు

'జట్టు'కు రూ.5 లక్షలు విరాళం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలో తోటపల్లిలో నిర్మాణంలో ఉన్న జట్టు ట్రస్ట్ భవన నిర్మాణాలకు పార్వతీపురానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు పాల్తేరు సూర్యప్రకాశరావు రూ.5లక్షలు విరాళంగా అందజేశారు. సూర్య ప్రకాశరావు తన కుటుంబ సభ్యులతో కలిసి తోటపల్లి జట్టు ట్రస్ట్‌కి వచ్చి, సంస్థ వ్యవస్థాపకులు డి.పారినాయుడుకు విరాళం అందించారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రజల కోసం నిజాయతీగా పనిచేస్తున్న ట్రస్ట్‌కు విరాళం ఇవ్వాలని తన భార్య బతికి ఉన్నప్పుడే నిర్ణయించుకున్నానని తెలిపారు. ఆమె ఆత్మ శాంతి కోసం ఇప్పుడు ఈ విరాళం ఇస్తున్నట్లు ప్రకాశరావు ప్రకటించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం

ప్రజాశక్తి-రామభద్రపురం

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్య సేవలే లక్ష్యంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని కేంద్ర ఎన్క్వాస్ బృందం సిఎంఒ నాగరాజు, మెటర్నల్ చైల్డ్ హెల్త్ ఆఫీసర్ ఈశ్వరి ఆదేశించారు. బుధవారం ఆరికతోట పిహెచ్‌సిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణ, పలు రికార్డులు పరిశీలించారు. రోగులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, సేవల వివరాలు ఆసుపత్రి వైద్యులు దీపక్ కుమార్, అపర్ణలను అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ సేవలకు ప్రోత్సాహకంగా ఆర్థిక సాయం అందిస్తామని ఇలా వచ్చిన మొత్తాన్ని ఆసుపత్రి అభివృద్ధికి ఖర్చు చేయాలని కోరారు. గ్రామాల్లో అత్యుత్తమ వైద్య సేవలు, ఉచిత మందులు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని, పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

ప్రజాశక్తి-బొబ్బిలి

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే పోరాటం చేసి అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మణికుమార్, శివ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి 25 వరకు ప్రభుత్వం కళాశాలలకు సెలవులు ప్రకటించిందని, ఆయా రోజుల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.

గ్రంథాలయ నిర్మాణానికి సహకరించాలి

నెల్లిమర్ల : మండలంలోని తంగుడుబిల్లి గ్రంథాలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని శ్రీ రామ యువజన సంఘం నాయకులు కోరారు. మంగళవారం యువజన సంఘం ప్రతినిధి చందక మన్మధ రావు మాట్లాడుతూ తంగుడుబిల్లి గ్రామంలో పెద్ద మాస్టారు పి. నర్సింహం స్ఫూర్తితో శ్రీరామ యూత్ ఈ- గ్రంథాలయం సువిశాల ప్రాంగణంలో యువత, విద్యార్థులు కోసం నిర్మిస్తున్నామని తెలిపారు. ఆర్థిక సహాయం చేయదలిచిన వారు 8985493914, 6305042755 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విఫలమైన సిఎంగా జగన్

టిడిపి రీజనల్ కోఆర్డినేటర్ సత్య

మాట్లాడుతున్న టిడిపి రీజనల్ కోఆర్డినేటర్ సత్య

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్ర చరిత్రలోనే విఫలమైన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని టిడిపి రీజనల్ కోఆర్డినేటర్ దామచర్ల సత్య విమర్శించారు. బుధవారం పార్వతీపురంలో ప్రయివేటు హాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర అధ్యక్షతన నిర్వహించిన పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయనతోపాటు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్ష నాయకులు ప్రస్తావిస్తే, గ్రహించి సరిదిద్దుకోవాల్సింది పోయి, వారిపై కక్ష గట్టి అక్రమ కేసులతో అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబును అరెస్టుచేసి, 40 రోజులుగా జైల్లో కూర్చోబెడితే పార్టీశ్రేణుల మనోధైర్యం దెబ్బతింటుందని, తద్వారా ప్రజల్లో చెడ్డపేరు వస్తుందని కుత్సితపు ఆలోచనలో చేసినా... అవేవీ టిడిపి బలం ముందు నిలవలేదన్నారు. చంద్రబాబుకు ప్రజలంతా అండగా నిలిచి ఆదరించారన్నారు. అనంతరం టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఐటిడిఎలను పూర్తిగా నిర్వీర్యం చేయడం వల్ల గిరిజనులకు తీవ్రమైన నష్టం వాటిల్లిందన్నారు. ప్రతిఒక్కరూ క్షేత్రస్థాయిలో సైనికుల్లా పనిచేసి, చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డి.శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జి.రవికుమార్, సిరిపురపు భాస్కరరావు, మండల అధ్యక్షులు దొగ్గ మోహనరావు, పెంకి వేణుగోపాలరావు, పెంకి రామ్మోహనరావు పాల్గొన్నారు.

బయటపడ్డ అసంతృప్తి

ఈ సమావేశంలో టిడిపి పార్వతీపురం మండల అధ్యక్షులు దొగ్గ మోహనరావు మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర ఏకపక్షంగా వ్యవహరిస్తూ నాయకులను, కార్యకర్తలను విస్మరిస్తున్నారని అనగానే, ఒక్కసారిగా కలకలం మొదలైంది. ఆయనకు అనుకూలంగా, వ్యతిరేకంగా అక్కడున్న వారు నినాదాలు చేయడంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్ జోక్యం చేసుకుని అసంతృప్తి వ్యక్తం చేయడానికి ఇది సమయం కాదన్నారు. సమావేశం అనంతరం ప్రతిఒక్కరికీ అంతర్గతంగా మాట్లాడే అవకాశం ఇస్తామని, వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. పార్టీ అధినేత కష్టంలో ఉన్న సమయంలో అందరూ ఐక్యంగా ఉండాలని గదమాయించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

నిర్వాసితులకు సాగు పట్టాలివ్వాలి

వ్యకాస, ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి-సాలూరు

విఆర్ఎస్ ప్రాజెక్టు నిర్వాసితులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని అన్నంరాజువలస పంచాయతీ పందిరి మామిడి వలస, కుద్దాడవలస గ్రామాల గిరిజనులు సాగు చేస్తున్న భూములను బుధవారం వారు పరిశీలించారు. ముచ్చర్లవలస సర్వే నంబర్లు 56 నుంచి 107 వరకు 180 ఎకరాల భూమిని వందమంది గిరిజనులు గత 40 సంవత్సరాలుగా సాగు చేస్తున్నారని చెప్పారు. 40 ఏళ్ల క్రితం అప్పటి ఐటిడిఎ పిఒ ఎల్‌వి సుబ్రహ్మణ్యం కుద్దాడవలస, పందిరి మామిడి వలస గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అప్పటి నుంచి గిరిజనులు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదన్నారు. 2007లో సర్వే నెంబర్ 104, 105లో 13 ఎకరాల భూమిని అటవీశాఖకు రెవెన్యూ అధికారులు ఇచ్చారని చెప్పారు. ఆ భూముల సాగులో ఉన్న గిరిజనులు ఖాళీ చేయాలని అటవీ శాఖ అధికారులు బెదిరిస్తున్నారని, గిరిజనులపై దౌర్జన్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కుద్దాడవలస, పందిరి మామిడి వలస గిరిజనులు సాగు చేస్తున్న భూములకు వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు గూడెపు పులిరాజు, గవరయ్య, వల్లయ్య పాల్గొన్నారు.

గిరిజనులు సాగుచేస్తున్న భూములను పరిశీలిస్తున్న వ్యకాస, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ఆరోగ్య సురక్షతో మెరుగైన సేవలు

సీతానగరం.. ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి-సీతానగరం

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. మండలంలోని జోగంపేట సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.సింహాచలం, పాల ఈశ్వర్ నారాయణ, వైసిపి మండల అధ్యక్షులు బి.చిట్టిరాజు, ఎంపిపి శ్రీరాములు నాయుడు, రవణమ్మ, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం మండలంలోని డోకిశిల పిహెచ్‌సి పరిధిలోని డికె పట్నంలో జెఎఎస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అంగన్వాడీ స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివన్నారాయణ, వైద్యాధికారులు డాక్టర్ భాస్కరరావు, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపిలు సిద్ధా జగన్నాథరావు, బంకురు రవికుమార్, నాయకులు బొమ్మి రమేష్, భీమవరపు కృష్ణమూర్తి, మడక విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అన్నారు. మండలంలోని కొత్తవలసలో జగనన్న అరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ శివకుమార్, వైసిపి మండల అధ్యక్షులు సువ్వడ శ్రీనివాసరావు, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, సర్పంచ్ నెమలపిట్ట ధర్మావతి, కళ్యాణ్, ఐసిడిఎస్ అధికారులు, జైసింహ, నాయుడు పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

డిఐఒ జగన్మోహనరావు

ప్రజాశక్తి-సీతానగరం

వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

వ్యాధి నిరోధక టీకాలతో పిల్లలకు పలు ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షణ కలుగుతుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు తెలిపారు. మండలంలో నిడగల్లు, చిన్నరాయుడుపేట గ్రామాల్లో టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకా కార్డులు, ఆర్‌సిహెచ్ రిజిష్టరు పరిశీలించారు. నిర్ణీత గడువు తేదీలను ఎంసిపి కార్డులో నమోదు చేసి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. వేస్తున్న ప్రతి టీకా ఆవశ్యకతను వారికి వివరించాలన్నారు. టీకా కేంద్రంలో వ్యాక్సిన్, అత్యవసర మందుల కిట్, హబ్ కట్టర్ పరిశీలించారు. హబ్ కట్టర్ వినియోగిస్తున్న విధానాన్ని పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల వరకు ఆయా వయసు బట్టి వ్యాధినిరోధక టీకాలు షెడ్యూలు ప్రకారం వేయాలన్నారు. తద్వారా క్షయ, హెపటైటిస్, పోలియో, న్యూమోనియా, కోరింత దగ్గు, కంఠసర్పి, దనుర్వాతం, తట్టు, రుబెళ్ళ, అతిసార, దృష్టి సంబంధిత సమస్యలు రాకుండా రక్షణ కలుగుతుందని చెప్పారు. టీకా వివరాలు ఎప్పటికపుడు యూవిన్, ఆర్‌సిహెచ్ పోర్టల్స్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది జె.గౌరి, జి.ధరణి, జె.గౌరీశ్వరమ్మ, అంగన్వాడీ సిబ్బంది ఆర్.సులోచన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు, గుమ్మలక్ష్మీపురం... బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేస్తున్న గుమ్మడి సంధ్యారాణి, డొంకాడ రామకృష్ణ, తదితరులు

రాజకీయ కక్ష సాధింపే

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఏ తప్పూ చేయని టిడిపి అధినేత చంద్రబాబును ఇన్ని రోజులు జైల్లో ఉంచడం రాజకీయ కక్షసాధింపేనని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి అభిప్రాయ పడ్డారు. బుధవారం మండలంలోని పెద్దబోరబందలో బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి, వారి జీవితాలను బాగు చేయాలని లక్ష్యంతో చంద్రబాబు నాయుడు జీవితమంతా గడిపారని తెలిపారు. అటువంటి వ్యక్తి తప్పు చేశారని వైసిపి సర్కారు కక్షగట్టి ఆయనను జైల్లో పెట్టించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, రామకృష్ణ, శ్యామ్, సత్యం, తాడుతూరి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పరజపాడులో టిడిపి నిరసన ర్యాలీ

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలంలోని పరజపాడు గ్రామంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు అరెస్టు గురించి గ్రామంలో ఉన్న ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రతిఒక్కరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామక్రిష్ణ, ఎంపిపి బొంగు సురేష్, ఎస్‌టి సెల్ అరుకు పార్లమెంటు అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు , తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి, సర్పంచ్ రామకృష్ణ, ఎంపిటిసి అన్నపూర్ణ, మూడడ్ల సత్యం నాయుడు, శివ్వల నర్సింగరావు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని శంబాం పంచాయతీ జిల్లేడుపాడు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహాయంతో శివాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వి.కళావతి బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే చొరవతో రూ.10 లక్షలను టిటిడి మంజూరు చేయడంతో గ్రామస్తులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-సాలూరు

షాపింగ్ మాల్, ఇతర రద్దీ ప్రదేశాలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అగ్నిమాపక సిబ్బంది వివరించారు. పట్టణంలోని మెయిన్ రోడ్‌లో ఉన్న మంజుల షాపింగ్ మాల్‌లో అగ్నిమాపక స్టేషన్ అధికారి యు.సుధాకరరావు ఆధ్వర్యాన సిబ్బంది ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై షాపింగ్ మాల్ సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయ పాఠాలు చేర్చాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

పూర్వ ప్రాథమిక పాఠశాలల స్థాయి నుంచి యూనివర్సిటీ వరకూ పాఠ్యాంశాలలో ప్రకృతి వ్యవసాయ పాఠాలు పెట్టవలసిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించి ఆ దిశగా అడుగులు వేస్తుందని ఆర్‌వైఎస్ఎస్ స్టేట్ సిలబస్ కన్సల్టెంట్ డి.పారినాయుడు తెలిపారు. బుధవారం తోటపల్లి ట్రస్ట్ భవన్లో రచయితలు, ఉపాధ్యాయులతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. నాలుగు రోజుల్లో పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యలో చేర్చవలసిన విషయాలను తయారు చేసినట్లు తెలిపారు. మానవాళి భవిష్యత్తు కోసం పిల్లల నుండే ప్రకృతి వ్యవసాయ పాఠాలు బోధించే విధానం అమలులోకి తీసుకు రావలసిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు బెహరా ఉమామహేశ్వరరావు, రౌతు వాసుదేవరావు, లంకా వెంకటస్వామి, కిలపర్తి దాలినాయుడు, బొంతలకోటి శంకరరావు, మంచిపల్లి శ్రీరాములు, పెంకి గౌరీశ్వరరావు, తుంబలి శివాజీ, నల్లా బాలకృష్ణ, అల్లువాడ కైలాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రం సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సవర భాష వాలంటీర్ల శిక్షణ కేంద్రాన్ని డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి సందర్శించారు. 1 నుంచి 5వ తరగతి జిపిఎస్ విద్యార్థులకు తెలుగు పాఠ్యపుస్తకాల్లోని పదాలను సవర భాషలో చెప్పి నేర్పించేందుకు భాషా వాలంటీర్లు తయారు చేసిన టిఎల్‌ఎం మెటీరియల్ వివరించారు. కార్యక్రమంలో ఎఎంఒ పి.కోటిబాబు, తదితరులు పాల్గొన్నారు.

20న దశమంతపురంలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని దశమంతపురం గ్రామంలో ఈ నెల 20న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వై.వెంకటరమణ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రోడ్లపై చెత్త వేయొద్దు

కమిషనర్ టి.జయరాం

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని ప్రధాన రోడ్లపై చెత్త వేయొద్దని మున్సిపల్ కమిషనర్ టి.జయరాం కోరారు. బుధవారం ఆయన పట్టణంలోని శివాజీ సెంటర్, ప్రధాన రహదారి, కన్యకా పరమేశ్వరి ఆలయం వీధుల్లో నిర్వహించిన పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది సరఫరా చేసిన చెత్తబుట్టల్లో చెత్త వేయాలని సూచించారు. కాలువల్లోనూ చెత్త వేయొద్దని కోరారు. విధినిర్వహణలో సక్రమంగా పని చేసేలా చూడాలని శానిటేషన్ ఇన్ స్పెక్టర్ ఫకీర్ రాజును ఆదేశించారు.

నేరాలు ఘోరాలు

బాలుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కొమరాడ

కార్తీక్ (ఫైల్)

మండలంలో మూడు రోజుల క్రితం తప్పిపోయిన బాలుడి మృతదేహం నాగావళి నదిలో లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొమరాడ మండలంలోని కొట్టు గ్రామానికి కొల్లి అప్పలస్వామి కుమారుడు కార్తీక్ (8) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి తప్పిపోయాడు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కొమరాడ పోలీసులకు తండ్రి అప్పలస్వామి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్న సమయంలో బుధవారం ఉదయం పేట గ్రామ సమీపంలో ఉన్న నాగావళి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అప్పలస్వామి కుమారుడి మృతదేహంగా గుర్తించారు. తల్లిదండ్రులకు సమాచారం అందించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ట్యాంకర్ లారీ

మద్యం మత్తులో డ్రైవర్ హల్‌చల్

తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి - కురుపాం

డ్రైవర్ మద్యం తాగి ఆయిల్ ట్యాంకర్ నడుపుతూ హల్ చల్ చేసిన సంఘటన కురుపాంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కురుపాంలోని సాయిరాం ఆలయం నుంచి గౌడువీధి జంక్షన్ వరకు సుమారు అర కిలోమీటర్ ఇష్టం వచ్చినట్లు డ్రైవర్ ట్యాంకర్ లారీ నడిపాడు. గౌడువీధి దగ్గర ముగ్గురు చిన్నారులను తప్పించిపోయి రోడ్డు పక్కన ఆపి ఉన్న మూడు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాడు. దీంతో డ్రైవర్‌కు స్థానికులు దేహశుద్ధి చేశారు. టాంకర్ లారీ తాళాలను స్వాధీనం చేశారు. మద్యం మత్తు దిగాక తాళాలు ఇస్తామని తెలిపారు.